క్లుప్తంగా

గురజాలలో స్వల్ప ఉద్రిక్తత

గురజాల : నగర పంచాయతీ పరిధిలోని మాడుగుల రోడ్డులో మంగళవారం సాయంత్రం స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. లక్ష్మీనగర్‌లోని పోలింగ్ బూత్‌లో సోమవారం ఇరు పార్టీల కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. మంగళవారం సాయంత్రం ఒక పార్టీకి చెందిన వ్యక్తులు మరొక పార్టీకి చెందిన వారి ఇంటి వద్దకు వెళ్లినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న సీఐ బాలకృష్ణ తక్షణం పోలీస్ సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లి నాయకులను చెదరగొట్టి.. చేసి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

టీడీపీ మూకల దాడి.. నలుగురికి గాయాలు


మూఢావత్ మల్లయ్య నాయక్

రెంటచింతల: మండల పరిధిలోని గోలి గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయులు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఇరు వర్గాలు రాళ్లు విసురుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ దాడిలో వైఎస్సార్ సీపీకి చెందిన మూఢావత్ మల్లయ్య నాయక్, మూఢావత్ కొండానాయక్, ఆర్.నాగేశ్వరరావునాయక్, మూఢావత్ నాగేశ్వరరావు నాయక్ గాయపడ్డారు. క్షతగాత్రులు గురజాల, పిడుగురాళ్ల ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు.

మాచర్లలో 75 శాతం పోలింగ్

మాచర్ల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మాచర్ల నియోజకవర్గంలో 75 శాతం పోలింగ్ శాతం నమోదైంది. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, యువత బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2,62,408 ఓట్లకు గాను 2,19,000 ఓట్లు పోలయ్యాయి. ఇతరులు 22 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కొబ్బరిచెట్టుపై పిడుగుపాటు



యడ్లపాడు: మండలం పరిధిలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం మంగళవారం కురిసింది. దీంతో నిన్నామొన్నటి వరకు ప్రచండ భానుడి ఉగ్రరూపంతో వేడిగాలులు, ఉక్కపోతలతో ఇబ్బందులు పడ్డ మండల ప్రజలకు ఊరట కలిగింది. సోమవారం జాలాది, జగ్గాపురం గ్రామాల్లో పది నిముషాలు కురిసిన ఈ వర్షం మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ అత్యధికంగా కురిసింది. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. మురుగు కాల్వల్లో చెత్తచెదారం ఉండటంతో కాల్వలు పొంగి పొర్లాయి.

కొబ్బరి చెట్టుపై పిడుగుపాటు

మండల కేంద్రమైన యడ్లపాడు ఎస్సీకాలనీ (కిందిపల్లె)కు చెందిన కారసాల మరియదాసు ఇంటి వద్ద ఉన్న కొబ్బరి చెట్టుపై వర్షానికి ముందుగా పిడుగు పడింది. దీంతో పచ్చని చెట్టుపై ఎర్రటి మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. ఇంటికి దూరంగా ఉండటంతో కేవలం చెట్టు మాత్రమే కాలిపోయింది.

108 అంబులెన్స్‌లో ప్రసవం



యడ్లపాడు: మండలంలో ఓ గర్భిణి 108 అంబులెన్స్‌లో చక్కని ఆడపిల్ల జన్మించింది. ప్రసవ సమయంలో శిశువు పేగును మెడకు రెండు చుట్లతో ఉన్నప్పటికీ సిబ్బంది ఎంతో చాకచక్యంగా సుఖ ప్రసవం చేశారు. యడ్లపాడు మండలం కొత్త సొలస గ్రామానికి చెందిన ఇంద్రజకు సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా పురిటినొప్పులు మొదలయ్యాయి. దీంతో 108కి ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. చిలకలూరిపేట 108 అంబులెన్స్ గ్రామానికి చేరుకుని ఇంద్రజను పట్టణంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికమయ్యాయి. దీంతో వాహనాన్ని పక్కకు ఆపి ఈఎంటీ శోభన్‌బాబు ప్రసవం చేశారు. పేగును మెడుకు చుట్టుకుని ఉన్నా తల్లీబిడ్డలు సురక్షితంగా ఉండేలా సుఖప్రసవం చేసి చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. 108 జిల్లా అధికారి సుబ్బారావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ అధికారి అజయ్ ఈఎంటీ శోభన్‌బాబుతో పాటు పైలెట్ అల్లాబక్షును అభినందించారు.

ఓటరు తీర్పు ఎటు వైపో..!

- గురజాలలో పెరిగిన ఓటింగ్ శాతం
- 84.30శాతం పోలింగ్ నమోదు
- 2019లో 83.52 శాతం పోలింగ్
- పురుషుల కంటే మహిళా ఓటింగ్ అధికం
- అధికంగా ఓటు వేసిన 5,515 మంది మహిళలు
- ఫలితాలపై ఎవరి అంచానాలు వారివే..


పులిపాడులో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్

గురజాల: పల్నాడు ప్రాంతం గురజాల నియోజకవర్గంలో అంచనాలకు మించి పెరిగిన ఓటింగ్ ఎవరిని వరిస్తుందోనని పలు రాజకీయ పార్టీల నాయకుల్లో ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఏ పార్టీకి ఆ పార్టీ నాయకులు తమ వైపే ఓటర్లు ఉన్నారంటూ... గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉందని అందు వల్లే ఓటింగ్ శాతం పెరిగిందని టీడీపీ నేతలు చెబుతుండగా.. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయని, గ్రామీణ ప్రాంతాల్లో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశామని ఓటర్లు తమ వైపే ఉన్నారని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘంటాపథంగా చెప్తున్నారు. వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని చంద్రబాబు నాయుడును ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అంటున్నారు.

పెరిగిన ఓటింగ్ శాతం

గురజాల నియోజకవర్గంలో 2,73,971 మంది ఓటర్లకు గాను 1,33,353 మంది పురుషులు, 1,40,576 మంది మహిళలు, 42 మంది ఇతరులు ఉన్నారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో 2,30,945 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 1,12,704మంది, మహిళలు 1,18,219 మంది, 22 మంది ఇతరులు ఉన్నారు. 84.30 పోలింగ్ శాతం నమోదైంది. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో 2,68,469 మంది ఓటర్లకు గాను 2,24,218 ఓట్లు పోలయ్యాయి. అప్పుడు 83.52 పోలింగ్ శాతం నమోదైంది. గత ఎన్నికల పోలింగ్‌తో పోలిస్తే ఈ ఏడాది ఓటింగ్ శాతం పెరిగిందనే చెప్పవచ్చు. పోలింగ్ శాతం పెరగడంతో పార్టీ నాయకులు ఎవరికి లాభం చేకూరుతుందోనని దానిపై లెక్కలు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఏ మండలంలో ఏ గ్రామంలో తమకు ఎన్ని ఓట్లు వస్తాయోనని ఆరా తీస్తున్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వారీగా ఎంత మెజార్టీ వచ్చింది... పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి కలిసివస్తుందని అని అంచనా వేస్తున్నారు.

ఈవీఎంలో ప్రజా ప్రతినిధుల భవితవ్యం

నియోజకవర్గంలో 304 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ పూర్తయింది. పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను ప్రత్యేక బస్సుల్లో నరసరావుపేటకు తరలించారు. ఈవీఎంలను ఒక గదిలో భద్రంగా ఉంచి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఈవీఎంలలో ప్రజా ప్రతినిధుల భవితవ్యం భద్రంగా పొందుపరిచారు. ప్రజలు ఎవరిని ఎన్నుకుంటారో వేచి చూడాల్సిందే.

రెంటచింతలలో 82.55శాతం పోలింగ్

- 2019 కన్నా 2.45శాతం తగ్గిన పోలింగ్
- మల్లవరంలో అత్యధికంగా 94.67 శాతం పోలింగ్


రెంటాల గ్రామంలో బారులు తీరిన ఓటర్లు(ఫైల్

రెంటచింతల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో సోమవారం 82.55 శాతం పోలింగ్ నమోదయ్యింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 85 శాతం పోలింగ్ శాతం నమోదు కాగా ప్రస్తుతం 2.55 శాతం తగ్గింది. గ్రామాల వారీగా పరిశీలిస్తే... రెంటచింతలలో 72.58 శాతం, రెంటాలలో 82.09 శాతం, మంచికల్లులో 86.27 శాతం, పాలువాయిగేటులో 69 శాతం, పాలువాయిలో 89.45 శాతం, పశర్లపాడులో 90 శాతం, జెట్టిపాలెంలో 80 శాతం, మల్లవరంలో 94.78 శాతం, మిట్టగుడిపాడులో 92.47 శాతం, తుమృకోటలో 80.55 శాతం, కొత్త గంగరాజుపల్లిలో 94 శాతం, గోలిలో 92 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని మొత్తం ఓటర్లు 40,603 మందికి గాను 33,517 మంది ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. మండల పరిధిలోని తుమృకోట, జెట్టిపాలెం. పాలువాయి గేటు గ్రామాల్లో ఈవీఎంలు ధ్వసం చేయడంతో పాటు రెంటచింతల, మంచికల్లు గ్రామాల్లో ఉదయం కొన్ని గంటల పాటు ఈవీఎంలు మొరాయించడం కారణంగా రాత్రి 10.30 గంటల వరకు అధికారులు పోలింగ్ నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ వర్గీయులపై టీడీపీ పెత్తందార్ల దాడి


కావూరులో ఎస్సీ వర్గీయులతో మాట్లాడుతున్న కావటి మనోహర్ నాయుడు

- కావూరులో ఎన్నికల ఏజెంట్‌తో పాటు మరొకరికి తీవ్ర గాయాలు
- మంచినీటి ప్లాంట్ నుంచి నీరు తీసుకెళ్లకుండా కట్టడి
- స్పందించి అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి

చిలకలూరిపేట: టీడీపీ నాయకులు పెత్తందారీ మనస్తత్వం మరోసారి వెలుగుచూసింది. ఇందుకు ఉదాహరణగా చిలకలూరిపేట మండలం కావూరు గ్రామంలో ఎస్సీకాలనీలో పోలింగ్ సందర్భంగా సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ నాయకుల దౌర్జన్య కాండ నిదర్శంగా నిలుస్తోంది. బాధితులు కథనం ప్రకారం ... కావూరు గ్రామంలోని ఎస్సీకాలనీ పోలింగ్‌బూత్ 211లో ఉదయం అర్ధగంట ఆలస్యంగా 7.30కు పోలింగ్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి ఓట్లు కొన్ని పోల్ కావల్సినవి మిగిలి ఉన్నాయి. దీని కోసం సమయం పెంచాల్సిందిగా వైఎస్సార్‌సీపీ తరుపున బూత్ ఏజెంటుగా ఉన్న నలమాల కాంతయ్య అధికారులకు విజ్ఞప్తి చేశాడు. ఇది నచ్చని టీడీపీలో ఆధిపత్య సామాజిక వర్గానికి చెందిన కొందరు వచ్చి ఘర్షణకు దిగారు. బూత్‌లో ఏజెంట్‌గా ఉన్న నలమాల కాంతయ్యను బయటకు లాగి దాడి చేశారు. మాకు ఎదురు మాట్లాడతావా అంటూ కులం పేరుతో తీవ్ర దూషణలకు దిగారు. ఈ దాడిలో కాంతయ్యకు తీవ్రగాయలయ్యాయి. మూకల దాడిలో తలపగిలి పడిపోయాడు. కాంతయ్యపై దాడిని అడ్డుకునేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ వర్గీయులు కట్టెం ఆనందరావుతో పాటు మరి కొందరికీ కూడా ఈ ఘటనలో గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కాంతయ్యతో పాటు ఆనందరావును మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్ కుమార్ యాదవ్ గాయపడిన వారిని ఫోన్లో పరామర్శించారు.

కొనసాగిన వివక్ష...

ఈ ఘర్షణ నేపథ్యంలో కావూరు గ్రామంలో ఉన్న మంచినీటి ప్లాంట్ నుంచి ఎస్సీ వర్గీయులను మంగళవారం మంచినీరు తీసుకువెళ్లకుండా కట్టడి చేసి వారి దాష్టీకాన్ని చాటుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు గ్రామానికి వెళ్లి బాధితులకు అండగా నిలిచారు. ప్రస్తుతానికి ఎలాంటి నీటి సమస్య లేకుండా ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేసే ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఎస్సీ కాలనీలో రూ.6 లక్షలు తన సొంత నిధులతో లూథరన్ చర్చి సమీపంలో కొత్తగా వాటర్ ప్లాంట్ నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు.

మధ్యవర్తిత్వంతో ఎక్కువ కేసులు పరిష్కారం

సత్తెనపల్లి: మధ్యవర్తిత్వం నిర్వహించి అధికంగా కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్), సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ చిలంకుర్తి వెంకట నాగ శ్రీనివాస రావు పేర్కొన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి బార్ అసోసియేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు. ముందుగా జడ్జి వెంకట నాగ శ్రీనివాస రావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం చట్టం గురించి, కేసుల పరిష్కారంతో కక్షిదారులకు వచ్చే ప్రయోజనాలను తెలియజేశారు. ప్రజలకు ఈ–సెంటర్ ప్రాముఖ్యతపై న్యాయవాదులు అవగాహన కల్పించాలన్నారు. దీనిలో కేసు పరిష్కారమైతే కోర్టు ఫీజు వాపస్ ఇస్తారని, అంతేకాకుండా దీని ద్వారా వచ్చేది అంతిమ తీర్పు స్పష్టం చేశారు. ఆ శక్తి కలిగిన న్యాయవాదులు ఈ–సెంటర్ ద్వారా కేసుల్లో మధ్యవర్తిత్వం చేసేందుకు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. సమావేశానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ అధ్యక్షత వహించారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి



అమరావతి: మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు యువకుడు మరణించాడు. గ్రామస్తులు సమాచారం మేరకు బలుసుపాటి వినయ్(20)మంగళవారం గేదెలను తోలుకుని పొలానికి వెళ్లాడు. సాయంత్రం 4 గంటలకు ఉరుములు మెరుపులతో కూడి గాలివాన రావటంతో ఇంటికి పోదామని బయులదేరుతుండగా ఒక్కసారి పిడుగు పడి వినయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం వినయ్ మృతదేహాన్ని అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. చేతికంది వచ్చిన కొడుకు మరణించటంతో వినయ్ తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

దుర్గిలో 87 శాతం పోలింగ్..

దుర్గి: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దుర్గి మండలంలో 86.86 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దారు జి.రజనీకుమారి మంగళవారం తెలిపారు. కొన్ని గ్రామాల్లో సోమవారం సాయంత్రం 6గంటల వరకు చేరుకున్న ఓటర్లకు అవకాశం కల్పిస్తూ రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగించినట్లు తెలిపారు. దుర్గి మండలంలో 41,866 మంది ఓటర్లకు గాను 36,366 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో స్త్రీలు 18,345, పురుషులు 18,020, ఇతరులు ఒకరు ఉన్నారు. గ్రామాల వారీగా చూస్తూ.. అడిగొప్పలలో 7,786 ఓట్లకు గాను 6,735, దుర్గిలో 7,184 ఓట్లకు 5,743, ముటుకూరు 5,634 ఓట్లకు 4,907, ఓబులేశునిపల్లెలో 3,717 ఓట్లకు 3,255, పోలేపల్లి 2,869 ఓట్లకు 2509, ధర్మవరంలో 2,661 ఓట్లకు 2,420, ఆత్మకూరులో 2,436 ఓట్లకు 2204, కోలగట్లలో 2,144 ఓట్లకు 1,948, కంచరగుంటలో 1,495 ఓట్లకు 1355, తేరాలలో 1,284 కు 1199, రాజానగర్‌లో 1,076 ఓట్లకు 875, శ్యామరాజుపురం 978 ఓట్లకు 894, నెహ్రూ నగర్ తండా 904 ఓట్లకు 838, జంగమహేశ్వరపాడులో 766 ఓట్లకు 634, మించాలపాడు 522 ఓట్లకు 490, కాకిరాల 410 ఓట్లకు 367 ఓట్లు పోలయ్యాయి. అత్యధికంగా మించాలపాడు 93.87శాతం కాగా, అత్యల్పంగా దుర్గి 79.90 శాతం పోలింగ్ నమోదయ్యింది.

నేటి నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటు

మొదటి బహుమతి రూ.66.666లు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో స్టార్ సీసీ ఆధ్వర్యంలో వెంకి టెన్నీస్ బాల్ మెగా క్రికెట్ టోర్నమెంటు పోటీలు నేటి నుంచి ఆరంభిస్తున్నట్లు టోర్నీ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మొదట బహుమతి రూ.66.666 వేలు (జ్యోతి శేషయ్య) రెండవ బహుమతి రూ. 55.555 వేలు (ఏకే 47 టీం వేల్పూరు) మూడవ బహుమతి రూ.33.333 వేలు (దొప్పులపూడి శ్రీకాంత్) నాల్గవ బహుమతి రూ. 22.222 వేలు (దోడ్డా ఏడుకొండలు) మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.5.555 (కాకర్ల ఆంజనేయులు) షీల్డ్ బహూకరణ రూ.15.000లు లింగా పున్నమ్మ (ఎంపీటీసీ సభ్యురాలు) తమవంతు సహకారం అందజేస్తున్నట్లు చెప్పారు. మ్యాచ్‌లో పాల్గొనే వారు ఎంట్రీ ఫీజు రూ. 999 రూపాయలు చెల్లించాలన్నారు. తుది నిర్ణయం కమిటీ, గ్రామపెద్దలదే అన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 89855 550551, 97040 66656, 90520 48214 సంప్రదించాలన్నారు.

17న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన వేడుకలు 17వ తేదీ ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి పుసులూరి శ్రీనివాసచారి మంగళవారం తెలిపారు. దాతలు సహకారంతో ఈ ఆరాధన వేడుకలు గత 10 సంవత్సరాల నుంచి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.

విద్యార్థినికి అభినందన


భవ్యహాసినిని సత్కరిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సత్య నారాయణ

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన కొప్పురావూరి భవ్య హాసిని ఇటీవల విడుదల అయిన పాలిసెట్ ఫలితాల్లో 100/120 మార్కులతో స్టేట్ 1,297వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన అభినందన సభలో పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐ ఎం.సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. ఇంతటి మంచి ర్యాంక్ సాధించడం మన సత్తెనపల్లి పట్టణానికి చాలా గర్వకారణమని సీఐ శ్రీనివాసరావు అన్నారు. సిద్ధికా కోచింగ్ సెంటర్ డైరెక్టర్స్ షేక్ సుభాని, షేక్ అహ్మద్ రూ. 5 వేలు నగదుని భవ్య హాసినికి బహుమతిగా అందించారు. దుశ్శాలువాలతో సత్కరించారు.

జోరున వర్షం.. చల్లబడిన వాతావరణం


పొలంలో నిలిచిన వర్షపు నీరు


కారంపూడి రహదారిలో నిలిచిన వర్షపు నీరు

గురజాల: మండలంలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం భానుడు తన ఉగ్రరూపం దాల్చాడు. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సుమారు గంట పాటు ఈదురు గాలులు వీస్తూ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, కోర్టు భవనాల ప్రాంగణం , సెబ్ కార్యాలయాలు వర్షపు నీరు నిలిచింది.

జోరున వర్షం..

క్రోసూరు: మండలంలో మంగళవారం సాయంత్రం జోరున వర్షం కురిసింది. ఏకధాటిగా వర్షం కురవటంతో రోడ్లు, పొలాలు జలమయం అయ్యాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండి సాయంత్రం వాతవరణం ఒక్కసారిగా చల్లబడి జోరున వర్షం కురిసింది. సుమారు అరగంట సమయం వర్షం కురవటంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి


మద్దు విజయసారథి(ఫైల్)

యడ్లపాడు: వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దు విజయసారథి (40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మండలంలోని ఉన్నవ గ్రామం ఉదయపూరి కాలనీకి చెందిన విజయసారథి చిలకలూరిపేట పట్టణంలోని ఓ సెల్‌షాపులో రిపేరుకు ఇచ్చిన ఫోన్ తెచ్చుకునేందుకు బంధువు మద్దు ఏసోబుతో కలిసి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో యడ్లపాడులోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్ నూలుమిల్లు సమీపంలో వచ్చేసరికి బైక్ అదుపుతప్పింది. దీంతో ఎదురుగా పోలీసులు ఏర్పాటు చేసిన బ్యారికేడ్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో విజయసారథి తీవ్రంగానూ, ఏసోబుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. సారథి ఆర్మీలో సోల్జర్‌గా చేరి దేశానికి సేవచేశాడు. వ్యక్తిగత కారణాలతో వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. అప్పటి నుంచి గ్రామంలో స్వయం ఉపాధిగా సెంట్రింగ్ వర్క్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. వైస్సార్ సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటు పార్టీ బలోపేతానికి కృషి చేశాడు. ఆయనకు భార్య ప్రియదర్శిని, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


ఘటన స్థలంలో మృతదేహం

నరసరావుపేట టౌన్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బరంపేట మూడుబావుల సెంటర్ ప్రాంతానికి చెందిన షేక్ పొద్దుటూరు పెద్ద ఖాశిం (29) గత ఐదేళ్ల క్రితం కడపకు వెళ్లి అక్కడే టీస్టాల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు రెండు రోజుల క్రితం నరసరావుపేటకు వచ్చాడు. సోమవారం బరంపేటలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకుని తురకపాలెంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి బజారుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. రాత్రి నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ రావటంతో బంధువులు ఖాశిం కోసం గాలించారు. ఈ క్రమంలో మంగళవారం చిత్రాలయ థియేటర్ ఎదురు రైలు పట్టాలపై శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ టి. సుబ్బారావు సంఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని పరిశీలించారు. విజయవాడ టు హుబ్లి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురొచ్చి ఆత్మహత్య చేసుకున్నట్లు ట్రైన్ లోకో పైలెట్ సోమవారం రాత్రి సమాచారం అందించాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావాల్సి ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ ఆటవిక ఆట


ఇంటిలోని సామాన్లు చెల్లాచెదురు


టీడీపీ మూకలు ధ్వంసం చేసిన రేకుల ఇల్లు



ధ్వంసమైన ద్విచక్ర వాహనాలు


పగలగొట్టిన జేసీబీ వాహనం అద్దాలు


ధ్వంసమైన ఆటో

మండలంలోని కొత్తగణేశునిపాడు గ్రామంలో టీడీపీ మూకల విధ్వంసానికి నిదర్శనం ఈ చిత్రాలు. వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారనే అక్కసుతో పచ్చ మూకలు ఆటవిక చర్యలకు దిగాయి. వైఎస్సార్ సీపీ సానుభూతి పరులను టార్గెట్ చేస్తూ వారి ఇళ్లపై దాడులు చేశారు. మోటారు బైకులు, ఆటోలు, ఇళ్లలోని సామాన్లు, టీవీలు ఇలా ఏవి దొరికితే వాటిని ధ్వంసం చేశారు.

–మాచవరం